క్లుప్తంగా

'స్పందన'కు మూడు అర్జీలు



రేపల్లె: సమస్యల పరిష్కారానికి మూడు అర్జీలు అందినట్లు రేపల్లె ఆర్డీఓ జగన్నాథం పార్థసారథి తెలిపారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. ఆర్డీఓ పాల్గొని, ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ఇంటి పన్ను రశీదు ఇప్పించాలని 1, సర్వే చేసి సరిహద్దులు చూపించాల్సిందిగా 2 అర్జీలు అందినట్లు ఆయన తెలిపారు. అర్జీలను పరిశీలించి, సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు.

'స్పందన' అర్జీదారులకు అల్పాహారం పంపిణీ



బాపట్ల అర్బన్: స్థానిక కలెక్టరేట్‌లో సోమవారం స్పందన కార్యక్రమం జరిగింది. అర్జీదారులకు సహాయ శిబిరం ద్వారా అంగన్‌వాడీ కార్యకర్తలు పి.మాధవి, కె.శ్రీలక్ష్మి, కె.రత్నకుమారి, వి.సుధారాణి, కె.నాగమణి, వై.వెంకటలక్ష్మి అల్పాహారం స్వయంగా తయారు చేసి, పంపిణీ చేశారు. సుమారు 300 మందికి అందించారు. బాపట్ల జిల్లా రెడ్ క్రాస్ చైర్మన్ నారాయణ బట్టు, బూర్లె రామసుబ్బారావు, శ్రీ రామచంద్ర మూర్తి, దేశరాజు రమణ బాబు, ఎండీ సాదిక్, గోపీ కృష్ణ, రియల్టర్ జి.రవి ఉన్నారు.

పశ్చిమ బ్యాంక్ కెనాల్‌కు తాగునీరు విడుదల



కొల్లూరు: దిగువ ప్రాంతాల్లో చెరువులు, కుంటలు నింపుకునేందుకు అవసరమైన తాగు నీటిని పశ్చిమ బ్యాంక్ కెనాల్‌కు నీటి పారుదల శాఖాధికారులు విడుదల చేశారు. విజయవాడ ప్రకాశం బ్యారేజ్ నుంచి పశ్చిమ బ్యాంక్ కెనాల్‌కు 140 క్యూసెక్కుల నీటిని విడుదల చేయడంతో ఆ నీటిని కొల్లూరు లాక్‌ల నుంచి విడుదల చేస్తున్నారు. వేసవిలో చెరువులు ఇంకిపోయి దిగువ ప్రాంతాల్లో తాగునీటి సమస్య ఉత్పన్నమయ్యే అవకాశం ఉంది. ప్రస్తుతం తాగునీటి చెరువులతో పాటు, సాధారణ చెరువులను కూడా ఈ నీటితో నింపుకునే వెసులుబాటు కలిగింది.

నగరేశ్వర స్వామికి పూజలు



కొల్లూరు: ఆరుద్ర నక్షత్రం పురస్కరించుకుని సోమవారం నగరేశ్వర స్వామికి ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. కొల్లూరు కన్యకాపరమేశ్వరి దేవస్థాన ప్రాంగణంలోని నగరేశ్వరస్వామికి పంచామృతాలతో అభిషేకం నిర్వహించారు. పలు రకాల పుష్పాలతో ప్రత్యేక అలంకరణలో స్వామి భక్తులు దర్శనమిచ్చారు. పూజా కార్యక్రమాలను గాదేపల్లి శివశర్మ నిర్వహించగా, ఆలయ కమిటీ సభ్యులు పబ్బిశెట్టి సత్యకుమార్, తాడేపల్లి కృష్ణబాబు పర్యవేక్షించారు.

23న పూర్వ విద్యార్థుల సమావేశం

రేపల్లె రూరల్: పట్టణంలోని ప్రభుత్వ ఏబీఆర్ డిగ్రీ కళాశాలను త్వరలో న్యాక్ పీఆర్ టీం సందర్శించనున్నందున ఈ నెల 23న ఉదయం 10.30 గంటలకు కళాశాల సెమినార్ హాలులో పూర్వ విద్యార్థుల సమావేశం జరుగుతుందని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టీసీ రవిచంద్రకుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశంలో పూర్వ విద్యార్థులు పాల్గొని నాక్‌ నందు మంచి గ్రేడ్ పొందేందుకు తగిన సూచనలు, సలహాలు అందించాలని కోరారు.

వైఎస్సార్ బీమా నగదు చెక్కు అందజేత



బాపట్ల అర్బన్: ఈస్ట్ బాపట్ల పరిధిలోని హైదర్ పేట నివాసి పెరుమాళ్ల లక్ష్మి(49) మే 31న మృతి చెందారు. మృతురాలి కుటుంబానికి సోమవారం వైఎస్సార్ బీమా కింద రూ.10వేలు అందించారు. కార్యక్రమంలో ఈస్ట్ బాపట్ల పంచాయతీ కార్యదర్శి పల్నాటి శ్రీరాములు, పీటా వేణుగోపాల్, బొనిగల డేవిడ్ రాజు, మహిళా పోలీస్ మేడూరి సుప్రియ, వలంటీర్ ప్రేమ కుమారి పాల్గొన్నారు.

నిందితులు అరెస్ట్

పెదనందిపాడు: మైనర్ బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన కేసులో నిందితులను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ అబ్దుల్ రెహమాన్ సోమవారం తెలిపారు. పెదనందిపాడుకు చెందిన టి.కార్తీక్, ఎం.హరిప్రసాద్, కె.ప్రభాస్ బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించారని, వారిపై కేసు నమోదు చేశామని తెలిపారు. సోమవారం ఉదయం పెదనందిపాడులో అరెస్ట్ చేసి బాపట్ల కోర్టులో హాజరుపరిచినట్లు చెప్పారు.

మట్టి నమూనాలు సేకరించాలి

డీడీఏ డాక్టర్ విజయనిర్మల



మాట్లాడుతున్న డీడీఏ డాక్టర్ విజయనిర్మల

కర్లపాలెం: ఈ ఖరీఫ్ సీజన్‌కు రైతులు సాగు చేపట్టనున్న భూముల్లో మట్టి నమూనాలు సేకరించాలని వ్యవసాయ శాఖ డెప్యూటీ డైరెక్టర్ డాక్టర్ విజయనిర్మల ఆదేశించారు. కర్లపాలెం గ్రామ సచివాలయ సమావేశ మందిరంలో సోమవారం బాపట్ల నియోజకవర్గ పరిధిలోని గ్రామ వ్యవసాయ సహాయకులు, ఉద్యాన సహాయకులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో డీడీ విజయనిర్మల మాట్లాడుతూ మట్టి నమూనాలు సేకరించి, భూసార ఫలితాల ఆధారంగా తగిన మోతాదులో ఎరువుల యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించాలని చెప్పారు. పచ్చిరొట్ట పైర్లు సాగుచేసి, భూమిలో కలియదున్నటం వల్ల భూమి సారవంతమవటంతో పాటు సూక్ష్మ పోషకాలు సమకూరుతాయని పేర్కొన్నారు. జిల్లా ఏరువాక కేంద్రం కో-ఆర్డినేటర్ డాక్టర్ ఓబయ్య మాట్లాడుతూ వెద పద్ధతిలో సాగు చేసేందుకు రైతులను ప్రోత్సహించాలని సూచించారు. ఈ పద్ధతిలో నారు, కూలీల ఖర్చులు తగ్గించుకోవచ్చని చెప్పారు. వరి వారం రోజులు ముందుగానే కోతకు వస్తుందని వివరించారు. వేరుశనగ సాగులో, వరినారుమడిలో యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బాపట్ల ఏడీఏ ఎ.లక్ష్మి, వ్యవసాయ శాస్త్రవేత్త సురేఖ, ఏవో సుమంత్‌కుమార్, పశు వైద్యులు రేచల్ దివ్య, హార్టికల్చర్ ఆఫీసర్ అలేఖ్య, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

'ఆణిముత్యాలు'కు పురస్కారాల ప్రదానం



విద్యార్థులకు పురస్కారాలు ప్రదానం చేస్తున్న సర్పంచ్, హెచ్ఎం

పల్లెకోన(భట్టిప్రోలు): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో టాపర్లుగా నిలిచిన వెల్లటూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు పథకంలో భాగంగా పురస్కారాలు, మెమెంటోలను సోమవారం సర్పంచ్ చౌటూరి లక్ష్మి ప్రదానం చేశారు. విద్యార్థులు షేక్ ప్రభు తేజ్ వలి, లుక్కా సాయి, అమృతలూరు సంజయ్ ఆదిత్య, అంబటి ఆదిన బ్లెస్సీలకు నగదు బహుమతులు వరుసగా రూ.3 వేలు, రూ. 2వేలు, రూ. వెయ్యి, ప్రశంసా పత్రాలు అందించారు. విద్యార్థులను ఘనంగా సన్మానించారు. వైఎస్సార్ సీపీ నాయకులు చౌటూరి రవీంద్ర, ఎస్ఎంసీ చైర్మన్ చెన్ను సాంబశివరావు, వైస్ చైర్మన్ రుక్మిణీదేవి, నాగ చాందిని, ఉపాధ్యాయులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

ఐలవరంలో శ్మశానవాటిక పనులు ప్రారంభం

ఐలవరం(భట్టిప్రోలు): ఐలవరంలో హిందూ శ్మశానవాటిక ఏర్పాటుకు సంబంధించిన పనులు సోమవారం ప్రారంభమయ్యాయి. ఎంతో కాలంగా శ్మశానవాటిక లేకపోవడంతో ఇటీవల గ్రామస్తులు రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున దృష్టికి తీసుకెళ్లారు. ఈ నెల 13న రేపల్లె ఆర్డీవో పార్థసారథి గ్రామానికి విచ్చేసి శ్మశానవాటిక స్థలాన్ని పరిశీలించారు. 40 సెంట్ల స్థలానికి సంబంధించి హద్దులు నిర్ధారించాలని రెవెన్యూ సిబ్బందిని ఆదేశించడంతో తహసీల్దారు ఎంఎల్ శ్రావణ్‌కుమార్ ఆదేశాను సారం వీఆర్వోలు పి.లీలాగ్రేసమ్మ, రత్నాకర్, గ్రామ సర్వేయర్లు రమేష్, వెంకటేష్ స్థలం హద్దులను నిర్ధారించారు. శ్మశానవాటిక సమస్య పరిష్కారం కానుండటంతో గ్రామస్తులు మంత్రి నాగార్జునకు కృతజ్ఞతలు తెలిపారు.

వీవీఐటీ అధ్యాపకుడికి డాక్టరేట్ ప్రదానం



డాక్టరేట్ అందజేస్తున్న చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్

పెదకాకాని: వాసిరెడ్డి వెంకటాద్రి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలోని సైన్స్ అండ్ హ్యూమానిటీస్ ఇంజినీరింగ్ విభాగ అసిస్టెంట్ ప్రొఫెసర్ ముత్యం వెంకట రామాంజనేయులు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి డాక్టరేట్ పట్టా పొందినట్లు కళాశాల చైర్మన్ వాసిరెడ్డి విద్యాసాగర్ తెలిపారు. నంబూరు వీవీఐటీలో సోమవారం అభినందన కార్యక్రమంలో చైర్మన్ విద్యాసాగర్ మాట్లాడుతూ.. మ్యాథమెటిక్స్ అండ్ గ్రాఫ్ థియరీ పరిశోధనలకు డాక్టరేట్ పొందినట్లు తెలిపారు. దూరాన్ని ఉపయోగించి గ్రాఫ్‌లో లైన్ తొలగించడం వల్ల వ్యాసార్థం, వ్యాసాల మార్పుపై చేసిన పరిశోధన పత్రాలను ప్రొఫెసర్ డాక్టర్ పీఎల్ఎస్ వర్మ పర్యవేక్షణలో అందించినట్లు తెలిపారు. అనంతరం డాక్టర్ వెంకట రామాంజనేయులును వైస్ చైర్మన్ వాసిరెడ్డి మహాదేవ్, ప్రిన్సిపల్ డాక్టర్ వై.మల్లికార్జునరెడ్డి, డీన్ ఆఫ్ అకడమిక్ డాక్టర్ కె.గిరిబాబు, డీన్ ఆఫ్ అడ్మిన్ డాక్టర్ ఎస్.కుమారస్వామి, సైన్స్ అండ్ హ్యూమానిటీస్ విభాగాధిపతి డాక్టర్ బీహెచ్ రాజ్యలక్ష్మి అభినందించారు.

ముగిసిన శ్రీమద్రామాయణ జ్ఞాన యజ్ఞం



చిన్మయ మిషన్ మాతాజీ శీలానంద

కర్లపాలెం: బుద్ధాం గ్రామంలో చిన్మయ మిషన్ ఆధ్వర్యంలో పది రోజులుగా జరుగుతున్న శ్రీమద్రామాయణ జ్ఞాన యజ్ఞం సోమవారం ముగిసింది. జ్ఞాన యజ్ఞంలో భాగంగా ప్రతిరోజూ రామాయణ ప్రవచనాలు, భజ గోవింద కార్యక్రమాలు నిర్వహించారు. ముగింపు సందర్భంగా నిర్వహించిన కోలాటం భక్తులను ఆకట్టుకుంది. యజ్ఞ ప్రసాదంగా భక్తులకు దేవుడు జీవుడు అనే పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో భక్తులు రామరాజు విజయమ్మ, నారాయణరాజు, ప్రభావతమ్మ, శివరామరాజు, నాగరాజు, బన్నారావూరి సత్యనారాయణ పాల్గొన్నారు.

నేడు మెగా రుణ మేళా

కర్లపాలెం: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యలయంలో మంగళవారం ఎంపీడీవో ఆధ్వర్యంలో మెగా రుణ మేళా నిర్వహించనున్నట్లు ఇందిర క్రాంతి పథం ఏపీఎం శ్రీనివాసులురెడ్డి సోమవారం ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 2 గంటలకు మేళా జరుగుతుందని పేర్కొన్నారు. పలు బ్యాంకుల బ్రాంచ్ మేనేజర్లు, ప్రతినిధులు పాల్గొంటారని తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరయ్యే నిరుద్యోగ యువతీ యువకులు తమ ధృవీకరణ పత్రాలతో హాజరు కావాలని పేర్కొన్నారు. మండల పరిధిలోని యాజలి, నల్లమోతువారిపాలెం, బుద్ధాం, పాతనందాయపాలెం, ఏత్రీవారిపాలెం, దుండివారిపాలెం, కొత్త నందాయపాలెం, దమ్మనవారిపాలెం గ్రామాల పరిధిలోని వారికి ఇంటర్వ్యూలు జరుగుతాయని ఏపీఎం తెలిపారు.

త్వరితగతిన పంట సాగు హక్కు పత్రాలు అందించాలి



సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దారు గోపాలకృష్ణ, ఏవో బి.శ్రీనివాసనాయక్

చేబ్రోలు: అర్హులైన కౌలు రైతులందరికీ పంట సాగు హక్కు పత్రాలను(సీసీఆర్‌సీ) త్వరితగతిన అందించాలని చేబ్రోలు తహసీల్దారు ఏబీ గోపాలకృష్ణ అన్నారు. చేబ్రోలులోని రైతు భరోసా కేంద్రం-1లో సోమవారం సీసీఆర్ కార్డులపై వీఆర్వోలు, వీఏఏలకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దారు గోపాలకృష్ణ మాట్లాడుతూ ఖరీఫ్, రబీ సీజన్‌లకు 11 నెలల కాలపరిమితితో కౌలు రైతులకు అందించే సీసీఆర్ కార్డుల వల్ల కలిగే ప్రయోజనాలను సిబ్బంది తెలియజేయాలన్నారు. ఏవో శ్రీనివాసనాయక్ మాట్లాడుతూ రైతు భరోసా రావాలన్నా, పంటల బీమా వర్తించాలన్నా, పంట రుణం పొందాలన్నా సీసీఆర్ కార్డు తప్పనిసరి అన్నారు. కౌలు కార్డు వలన భూ యజమానికి ఎటువంటి నష్టం ఉండదన్నారు. సమావేశంలో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వీఆర్వోలు, వీఏఏలు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబాలకు చేయూత



బాధిత కుటుంబాలకు సామగ్రి అందిస్తున్న ట్రస్ట్ ప్రతినిధులు

నిజాంపట్నం: మరకావారిపాలెంలో ఇటీవల అగ్ని ప్రమాదంలో పూరిళ్లు దగ్ధమైన బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు, దుస్తులను తుఫాన్ చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు సోమవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్ట్ ట్రెజరర్ బసవరాజు మాట్లాడుతూ బాధితులు నర్రా సాంబయ్య, మరకా కృష్ణ పూరిళ్లు పూర్తిగా దగ్ధమై కట్టుబట్టలతో బయటపడ్డారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ జాయింట్ సెక్రటరీ పి.లక్ష్మీనరసమ్మ, ట్రస్ట్ సభ్యులు కృష్ణకుమార్, మాజేటి విజయకుమార్, నాళ్లం వెంకటరమణ, నాళ్లం సాయి, పి.సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

బాలకార్మిక వ్యవస్థ వ్యతిరేక మాసం పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎంపీటీసీ సుందరరావు, వెంకయ్యలు

తెనాలిటౌన్: రూరల్ మండలం హాఫ్‌పేట గ్రామంలో చైల్డ్‌రైట్స్ అడ్వొకేసీ ఫౌండేషన్(క్రాఫ్) ఆధ్వర్యంలో బాల కార్మికవ్యతిరేక మాసం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఎంపీటీసీ సభ్యులు ఇసుకపల్లి సుందరరవు, క్రాఫ్ జిల్లా కోఆర్డినేటర్ జి.వెంకయ్యలు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుందరరావు మాట్లాడుతూ 18 సంవత్సరాలలోపు బాలలను పనిలో పెట్టడం నేరమని, బాలలందరూ బడికి వెళ్లేలాగా చేయాలని, ప్రతి పాఠశాలలో జగనన్న విద్యాకానుకలు అందిస్తున్నామని తెలిపారు. జూన్ నెలను బాలకార్మిక వ్యతిరేఖ మాసంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పికార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్ కె.యామిని, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, క్రాఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

గుండెపోటుతో గరికపాడు ఎఫ్ఏ మృతి

గరికపాడు(కాకుమాను): గరికపాడు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ఫీల్డ్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న గేరా రాజశేఖర్ సోమవారం ఉదయం గుండెపోటుతో మృతి చెందారు. కుటుంబ సభ్యులు, సంబంధిత అధికారుల వివరాల మేరకు.. గ్రామంలో కూలీలతో ఉపాధి పనులు చేయించి, ఇంటికి వచ్చే సమయంలో గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు పొన్నూరు ప్రైవేట్ వైద్యశాలకు ఆయనను తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. జెడ్పీటీసీ ముజావర్ షేక్ గుల్జార్‌బేగం, ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, ఎంపీడీఓ రామకృష్ణ, ఏపీఓ సింగారావు తదితరులు రాజశేఖర్ మృతదేహానికి నివాళులర్పించారు.


ఘనంగా ముగిసిన 'టీపీఎల్' క్రికెట్ పోటీలు



విజేత రమేష్ సీసీ జట్టుకు ట్రోఫీ, నగదు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి: క్రీడాకారులను ప్రోత్సహించేలా తెనాలిలో ఏటా క్రికెట్ పోటీల నిర్వహణ అభినందనీయమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. పట్టణ జయప్రకాష్‌నగర్‌లో గత 23 రోజులుగా జరిగిన తెనాలి ప్రీమియర్ లీగ్ (టీపీఎల్) క్రికెట్ పోటీలు సోమవారంతో ముగిశాయి. సాయంత్రం జరిగిన ముగింపు సభలో ఎమ్మెల్యే శివకుమార్, టూ టౌన్ సీఐ వెంకట్రావు విజేతలైన జట్లకు నగదు బహుమతులను ప్రదానం చేశారు. పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు మంచి క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించడం గొప్ప విషయమని ఎమ్మెల్యే శివకుమార్ అన్నారు. పోటీల్లో విజేతలకు మొదటి బహుమతిగా రూ.25 వేలు, రెండో బహుమతిగా రూ.15 వేలు, మూడో బహుమతిగా రూ.10 వేలతోపాటు మ్యాన్ ఆఫ్ ది సిరీస్‌కు రూ.5 వేల బహుమతిని, టీపీఎల్ ట్రోఫీని బహూకరించారు. రమేష్‌సీసీ జట్టు విజేత కాగా, కొరివి సురేష్‌సీసీ జట్టు రన్నరప్‌గా నిలిచింది. రోషన్ సీసీ జట్టు మూడో బహుమతిని సాధించింది. మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతిని గోపినాయుడు, జ్యోతుల బాబి మ్యాన్ ఆఫ్ ది సిరీస్ బహుమతిని గెలుచుకున్నారు. కమిటీ సభ్యులు కనపర్తి జవహర్ కుమార్, నాలాది ప్రభాకర్, వాసిమళ్ల జవహర్ లాల్, జ్యోతుల బాబు, బట్టు ఆదాం, మట్లపూడి రాజేశ్వరరావు, అత్తోట పవన్, శానం కిరణ్‌కుమార్, సతీష్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కఠారి హరీష్, అక్కిదాసు కిరణ్‌కుమార్, షేక్ దుబాయ్ బాబు, షేక్ మీరావలి పాల్గొన్నారు.

ఈ-ఆటోలు అందజేత



ఈ-ఆటోలను అందజేసిన కార్పొరేటర్ శ్యామల వెంకటరమణాదేవి

గుంటూరు రూరల్: పర్యావరణ పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యతని 26వ డివిజన్ కార్పొరేటర్ శ్యామల వెంకటరమణాదేవి అన్నారు. సోమవారం డివిజన్ పరిధిలోని చౌడవరం, సీఆర్ కాలనీల పారిశుద్ధ్య సిబ్బందికి రెండు ఈ-ఆటోలను అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ తడిచెత్త, పొడిచెత్త సేకరణ గురించి వివరించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. పారిశుద్ధ్య సిబ్బంది ఎప్పటికప్పుడు డస్ట్‌బిన్‌లను శుభ్రం చేయాలని సూచించారు. క్లీన్ గుంటూరు కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ప్రింటర్ బహూకరణ



అన్నవరపు లంక(కొల్లిపర): పాఠశాల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని సర్పంచ్ తోడేటి రాజేశ్వరి అన్నారు. సోమవారం మండలంలోని అన్నవరపు లంక గ్రామంలోని హైస్కూల్లో చదువుకున్న పూర్వవిద్యార్థులు పాఠశాలకు రూ.8 వేలరూపాయాలు విలువ కలిగిన ప్రింటర్ బహూకరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మారుమూలన ఉన్న పాఠశాలల్లో చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకొన్నాక ఆ పాఠశాలను మరిచిపోకుండా గుర్తించుకుని పాఠశాలకు అభివృద్ధి కోసం ఈ విధంగా సహాయ సహకారాలు అందిస్తున్న పూర్వ విద్యార్థుల గొప్పతనం ఎంతో అభినందనీయమన్నారు.ఇలా ప్రతి ఒక్కరూ ఆలోచిస్తూ పాఠశాల అభివృద్ధికి దోహదపడాలని కోరారు. కార్యక్రమంలో కమిటీ చైర్మన్ టి.శ్రీనివాస్, ప్రధానో పాధ్యాయుడు టి.మల్లేశ్వరరావు, వైస్ చైర్మన్ సువర్ణలక్ష్మి, మాజీ సర్పంచ్ రాధాకృష్ణమూర్తి, పూర్వవిద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగాతో జీవితానికి రాజ యోగం



వర్శిటీలో యోగాసనాలు వేస్తున్న విద్యార్థులు

చేబ్రోలు: విద్యార్థులు యోగా సాధన చేసినట్లయితే రాజయోగంతో జీవిస్తారని తెనాలిలోని సృష్టి హోలిస్టిక్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ సురేష్‌బాబు అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్ యూనివర్శిటీలో ఇంటర్నేషనల్ యోగా డే ను పురస్కరించుకుని వారోత్సవాలు నిర్వహిస్తున్నారు. సోమవారం యోగా ఫ్లాష్‌మాబ్, యోగా ఫర్ హైల్త్ సైన్స్, యోగా స్ట్రెస్ మేనేజ్‌మెంట్, యోగాసన కాంపిటీషన్స్, యోగా ఫర్ పోస్ట్ కోవిడ్ వంటి కార్యక్రమాలను నిర్వహించారు. డాక్టర్ సురేష్‌బాబు మాట్లాడుతూ శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శక్తుల సమీకృతికి దోహదపడే సాధనంగా యోగా పనిచేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

కాకుమాను ఎంఈఓ-2గా విజయ్ భాస్కర్

కాకుమాను: కాకుమాను ఎంఈఓ -2గా విజయ్ భాస్కర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఆయన అమరావతి మండలంలోని మునుగోడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా పనిచేశారు. బదిలీల్లో భాగంగా ఎంఈఓ-2గా ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఎంఈఓ కేఎఫ్ కెనడీకు నియామక పత్రాన్ని అందజేసి, విధుల్లో చేరారు .పలువురు ఉపాధ్యాయులు ఆయనను సన్మానించారు.

నేటి నుంచి భట్టిప్రోలులో రుణ మేళా

భట్టిప్రోలు: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో 2023-24 ఆర్థిక సంవత్సరానికి మంగళవారం నుంచి రుణ మేళా నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు సోమవారం తెలిపారు. ఈ మేళాకు ఆసక్తి కలిగిన మహిళా లబ్ధిదారులు సంబంధిత ధృవ పత్రాలతో పేర్లు నమోదు చేసుకుని, ఇంటర్వ్యూకు హాజరు కావాలని పేర్కొన్నారు. మంగళవారం భట్టిప్రోలు-1, 2, ఐలవరం-1, 2, కోనేటిపురం, పల్లెకోన, సూరేపల్లి సచివాలయాలు, బుధవారం వెల్లటూరు, పెదపులివర్రు, ఓలేరు, గొరిగపూడి, పెదలంక, సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులు హాజరు కావాలని తెలిపారు. ఈ క్యాంప్‌లో వెటర్నరీ, హౌసింగ్, డ్వామ్స్, వ్యవసాయ, హార్టికల్చర్, ఫిషరీస్ అధికారులతో పాటు మండలంలోని ఎస్‌బీఐ, యూబీఐ, సీజీజీబీ, జీడీసీసీ బ్యాంకులకు సంబంధించిన మేనేజర్లు కూడా హాజరవుతారని వెల్లడించారు. రూ. లక్ష నుంచి రూ.20 లక్షల వరకు బ్యాంకు రుణాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం, ఇతరులకు 35 శాతం సబ్సిడీ వర్తిస్తుందని వివరించారు.

నేడు కౌలు రైతులకు అవగాహన సదస్సులు

పిట్టలవానిపాలెం(కర్లపాలెం): కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేసేందుకు మంగళవారం కోమలి, భవనంవారిపాలెం గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని పిట్టలవానిపాలెం ఏవో సత్యానందం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రెవెన్యూ, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ఈ అవగాహన సదస్సులను కౌలు రైతులు వినియోగించుకోవాలని పేర్కొన్నారు.